ఈనాడు
వికారాబాద్
ఆదివారం అక్టోబరు 20, 2024

దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: జినగుర్తి శివారులోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో టీజీటీ, పీజీటీ ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ గడువును ఆదివారం వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ వెంకటమ్మ వెల్లడించారు. మ్యాథ్స్, జువాలజీ జూనియర్ అధ్యాపక పోస్టులు, టీజీటీలో మ్యాథ్స్, ఆంగ్లం, సాంఘికశాస్త్రం, పీడీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్టుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులను దరఖాస్తు చేయాలని సూచించారు. ఈనెల 21న రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని మానసహిల్స్‌లో ముఖాముఖి నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు.

ప్రపంచ శాంతికి మన దేశం దిక్సూచి: స్పీకర్



ఏఐపీఎస్ఓ సభ్యత్వం తీసుకున్న ప్రసాద్‌కుమార్

వికారాబాద్, న్యూస్‌టుడే: ప్రపంచ శాంతికి మన భారతదేశం దిక్సూచి లాంటిదని, శాంతి కాముక దేశంగా కొనసాగుతూ ప్రపంచ దేశాలకు శాంతి సందేశం ఇస్తోందని శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని ఓ విందు వేదికలో ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్ఓ) జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మా గాంధీ అహింస అనే ఆయుధంతోనే పోరాటం చేసి దేశానికి స్వాతంత్ర్యం సాధించిన తీరు ప్రపంచానికి మార్గ దర్శనమన్నారు. శాంతి కోసం కృషి చేస్తున్న ఏఐపీఎస్ఓలో సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సంస్థ అధ్యక్షుడు ఒబెదుల్లా కొత్వాల్, ఏఐపీఎస్ఓ జాతీయ ప్రతినిధులు డాక్టర్ దిడ్డి సుధాకర్, కేవీఎల్, జి.రఘుపాల్, ఆచార్యిణి సమత, పురపాలిక అధ్యక్షురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

21న డీసెట్ ధ్రువ పత్రాల పరిశీలన

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: డీఈఈసెట్-2024కు సంబంధించిన అభ్యర్థుల నిజ ధ్రువ పత్రాల పరిశీలనకు ఈనెల 21న సోమవారం ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించారని డైట్ ప్రిన్సిపల్ రామాచారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా విద్యా శిక్షణ సంస్థలో పరిశీలన జరుగుతుందన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీఈఈసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు నిజపత్రాల పరిశీలన అనంతరం రెండు సంవత్సరాల కోర్సులో అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఈనెల 23 నుంచి 26 వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలన్నారు.

ఇక్కడ సైనికులకు అన్నీ ఉచితమే!



ఈ చిత్రం చూడగానే.. ఇదేదో సాధారణ హోటలే కదా.. ఏముంది విశేషం అనిస్తుంది కదూ! దీని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందే. ఇక్కడికి సైనికులెవరైనా వస్తే అన్నింటినీ ఉచితంగా అందించడమే ఆ ప్రత్యేకత.

న్యూస్‌టుడే, కోహీర్

కని పెంచిన తల్లిదండ్రులకు, ఉన్న ఊరికి దూరంగా.. దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి కాపలా కాస్తూ మనల్ని రక్షిస్తుంటారు సైనికులు. వారి సాహసం, త్యాగం వెలకట్టలేనివి. ఎక్కడైనా కనిపిస్తే మన మనసు ఉప్పొంగుతుంది. వారికి సెల్యూట్ చేస్తుంటాం. దేశానికి ఇంతగా చేస్తున్న సైన్యం అంటే ఆ కుటుంబానికి ప్రాణం. తమ ఫలహారశాలలో సైనికులకు అన్నింటినీ ఉచితంగా అందిస్తుండటం విశేషం. వారే సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం దిగ్వాల్ సమీపంలోని హోటల్ నిర్వాహకులు సానం వాసుదేవ్ కుటుంబసభ్యులు.



వాసుదేవ్‌తో వైమానిక దళం సిబ్బంది

చిన్నతనంలోనే..

ఇదే జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లికి చెందిన సానం జగన్నాథం, శాంతమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు వాసుదేవ్, గోవింద్, వెంకటేశం, కుమార్తె పార్వతమ్మ ఉన్నారు. జగన్నాథం కోహీర్ మండలం కొత్తూర్(డి) సమీపంలో 9వ నంబరు జాతీయ రహదారి (ప్రస్తుత ఎన్‌హెచ్ 65)లో టీ హోటల్ నడిపేవారు. పెద్ద కుమారుడు వాసుదేవ్ 1986లో ఏడో తరగతి పాసయ్యాడు. అప్పట్లో తనకిష్టమైన ఆర్మీ జవాను ఉద్యోగానికి ఎంపికయ్యారు. దీనికి ఇష్టపడని అతడి తల్లిదండ్రులు వాంగ్మూల పత్రంపై సంతకం చేయలేదు. వాసుదేవ్ నిర్ణయం మార్చుకొని పదేళ్లు హైదరాబాద్ సమీపంలో పండ్ల వ్యాపారం చేశారు. ఆ తర్వాత పలు కారణాలతో తిరిగొచ్చేసి హోటల్ నడిపిస్తున్నారు.

కుమారుడినైనా..

వాసుదేవ్‌కు వెంకటమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. ముగ్గురు కుమార్తెలు. కుమారుల్లో ఒకరు ఆర్మీలో చేరాలని వాసుదేవ్ ఆశించారు. పెద్ద కుమారుడు నారాయణ సరిపడా ఎత్తు లేక విఫలమయ్యారు.

ప్రత్యేకంగా స్వాగతం



వాసుదేవ్ కుమారుడిని సన్మానిస్తున్న కోదండరాం

8 ఏళ్ల కిందట వాసుదేవ్ తన హోటల్‌ను దిగ్వాల్ సమీపంలోని పెట్రోల్‌బంక్ పక్కకు మార్చారు. 65వ నంబరు జాతీయ రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. తమ హోటల్‌కు వచ్చే సైనికులకు ఆహారం ఉచితంగా అందించాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్ వైపు సైనికుల వాహనాలు వెళ్తూ తమ హోటల్ దగ్గర ఆగగానే ప్రత్యేకంగా స్వాగతం పలుకుతారు. జవాన్లు తీసుకునే అల్పాహారానికి, ఛాయ్, ఇతర వస్తువులకు ఎలాంటి డబ్బు తీసుకోకుండా ఉచితంగా ఇచ్చేస్తారు వాసుదేవ్. వీరి సేవలను గుర్తించిన ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం 2019లో సత్కరించారు.

నిజమైన హీరోలు వారే..: వాసుదేవ్

తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైన్యమే నిజమైన హీరోలు. నా జీవిత లక్ష్యం నెరవేరకున్నా ఆర్మీ జవాన్లకు నా వంతుగా సేవ చేస్తున్నా. నేటి యువత దృఢంగా ఉండి మాతృభూమి సేవలో మమేకమవ్వాలన్నదే నా అభిప్రాయం.

భగీరథ నీరే సురక్షితం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: మిషన్ భగీరథ నీరే సురక్షితమని శాసన సభ్యులు కాలె యాదయ్య అన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం (మిషన్ భగీరథ) ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామ పంచాయతీ నీటి సరఫరా సిబ్బంది (వాటర్ మెన్) శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇలాంటి శిక్షణ కార్యక్రమం వాటర్ మెన్‌లకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. డీఈ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. భగీరథ నీటిలో సమపాళ్లలో ఖనిజ లవణాలు ఉంటాయని, ఈ నీరే ఆరోగ్యానికి సురక్షితమన్నారు. ప్రైవేట్ నీటి శుద్ధి కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన నీటిని రివర్స్ ఆస్మోసిస్ (ఆర్‌ఓ) చేయడం ద్వారా నీటిలో ఉన్న ఖనిజ లవణాలు పూర్తిగా బయటకు వెళ్లిపోతాయని, ఈ నిర్వీర్యమైన నీటిని తాగడం వల్ల పెద్దవారిలో ఎముకల బలహీనత, చిన్న పిల్లల్లో ఎదుగుదల లోపం, దంతాల సమస్య, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ (గ్రిడ్) సువర్ణల, ఎంపీడీఓ అనురాధ, ఏఈ సాయినాథ్, కెమిస్ట్ ఉదయ్ కుమార్, వాటర్ మెన్‌లు పాల్గొన్నారు.

పెట్టుబడిదార్లను ప్రోత్సహిస్తున్న కేంద్రం: సీపీఎం



మాట్లాడుతున్న జాన్ వెస్లీ

న్యూస్‌టుడే, తాండూరు: కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం పెట్టుబడిదార్లను ప్రోత్సహించి పేదలు, కార్మికులను విస్మరిస్తోందని రాష్ట్ర సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. శనివారం తాండూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం జిల్లా మూడో మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం తీరు వల్ల నిత్యావసర ధరలు పెరిగి ప్రజలపై అధిక భారం పడుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్ రాములు మాట్లాడుతూ ప్రజల పక్షాన నిరంతరం పోరాడేది సీపీఎం మాత్రమే అన్నారు. అంతకు ముందు పట్టణంలోని ఆర్టీసీ బస్టేషన్ సమీపం నుంచి మహాసభలు నిర్వహించిన వేడుక వేదిక వరకు సీపీఎం శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చంద్రయ్య పార్టీ జెండాను ఎగుర వేశారు. మహాసభల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుత సంచారం.. రైతుల కలవరం



పరిశీలిస్తున్న అటవీశాఖ బీట్ అధికారి భీమానాయక్



జంతువు పాద ముద్ర

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందన్న వార్త కలకలం రేపింది. ఈ సంఘటన మండల పరిధిలోని గడిసింగాపూర్ అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని జీడిగడ్డ తండాకు చెందిన మహిళలు సీతా ఫలాలను సేకరించేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లారు. తండాకు చెందిన లాలీ బాయి సీతాఫలం కాయలు కోస్తుండగా అంతలోనే కొంత దూరంలో చిరుతను పోలిన జంతువు కనిపించడంతో తోటి మహిళలకు కూడా తెలిపింది. వారంతా వారం దరూ ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. అక్కడినుంచి తండాకు చేరుకుని వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బీట్ అధికారి భీమానాయక్ జంతువు సంచరించిన ప్రాంతానికి చేరుకున్నారు. ఆ జంతువు పాద ముద్రలను సేకరించారు. ఎవరూ భయపడవద్దని, అటవీ ప్రాంతంలో కెమెరాలను అమర్చి చిరుత సంచారాన్ని గుర్తిస్తామని తండా వాసులకు భరోసానిచ్చారు.

పోచమ్మ తండాలో అధికారుల పరిశీలన

కొడంగల్, న్యూస్‌టుడే: మండలంలోని పోచమ్మ తండాలో చిరుత సంచరిస్తున్నట్లు రైతులు తెలిపిన ఆధారాల ప్రకారం శనివారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆనంద్, తహసీల్దార్ విజయ్‌కుమార్‌లు వెళ్లి పరిశీలించారు. రైతులు చూపిన ప్రదేశాలు పరిశీలించగా గుర్తులు చిరుతగుర్తుల మాదిరిగానే ఉన్నాయని వారు తెలిపారు.

తాండూరుగ్రామీణ సీఐ నియామకం



తాండూరుగ్రామీణ: తాండూరు గ్రామీణ సీఐగా శ్రీనివాస్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఎస్పీ నారాయణరెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. అనంతరం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని కలిశారు. గౌతాపూర్ శివారులోని గ్రామీణ సీఐ కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ ఎస్.అశోక్‌ను ఈనెల 3న ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే.

తాగు నీటిపై అవగాహన అవసరం

వికారాబాద్ కలెక్టరేట్: ప్రతి వ్యక్తి నీటిని పొదుపుగా వాడాలని ప్రముఖ హైడ్రాలజిస్ట్ డాక్టర్ పి.విష్ణు తెలిపారు. శనివారం సూర్యప్రకాశ్ కాలనీలో అగాఖాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు నీటి భద్రతపై అవగాహన కల్గి ఉండాలన్నారు. ఆగాఖాన్ సంస్థ ఇన్‌ఛార్జి బెంజిమన్, హరిచందన్ పాల్గొన్నారు.

తాండూరులో సబ్ కోర్టు ఏర్పాటుకు కృషి



కోర్టు ఆవరణలో పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: తాండూరులో సబ్ కోర్టు ఏర్పాటు కోసం కృషి చేస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టును ఆయన శనివారం సందర్శించారు. కోర్టు ఆవరణలోని పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన న్యాయవాదులతో మాట్లాడారు. ఇక్కడ సబ్ కోర్టు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. దీని కోసం అవసరమైన స్థలాన్ని సేకరించటానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్ర కిశోర్, తాండూరు న్యాయమూర్తి శివలీల, న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ సాంద్రతతోనే మక్కలకు అధిక బలం



మక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మోమిన్‌పేట: సాంద్రత తక్కువై మక్కలు అధిక బలాన్ని పొందడం వల్ల కంకులు అధికంగా రావడానికి ఆస్కారం ఉంటుందని శాస్త్రవేత్తల బృందం ఛైర్మన్ డాక్టర్ బద్రు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామానికి చెందిన రైతు దంగేరి నర్సింలు రెండున్నర ఎకరాల భూమిలో ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన 2288 రకం మక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి పంట సాగు చేశాడు. మక్కలకు కంకులు పుట్టే దశలో బహుళ కంకులు రావడంతో రైతు ఆందోళనకు గురై వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వారు రాజేంద్రనగర్ మక్కజొన్న పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలకు నివేదిక పంపించగా డా.బద్రు శాస్త్రవేత్తల బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి మాట్లాడారు. యజమాన్య పద్ధతులను సక్రమంగా పాటించడం వల్ల అధిక కంకులు వచ్చాయని కంకులు బలంగా ఉండడం వల్ల పంట దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త మల్లయ్య, ఏవో జయశంకర్ విస్తరణ అధికారి శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తల్లిదండ్రులకు సూచించారు. పట్టణంలోని సాయిపూరు ప్రాంతంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ ప్రాంతంలో వాహనాలు నడుపుతున్న మైనర్ల తల్లిదండ్రులను పిలిచి వారికి అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపటం ఎంత నేరమో వారికి వాహనాలు ఇవ్వటం తల్లిదండ్రులదీ అంతే నేరమన్నారు. పట్టణ సీఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

డ్రోన్ సర్వేతో తాండూరుకు కొత్తరూపు



అధ్యక్షురాలు, కమిషనర్‌తో మాట్లాడుతున్న ఆర్డీటీపీ నర్సింహారెడ్డి

తాండూరు టౌన్: తాండూరు పట్టణం కొత్త రూపును సంతరించుకోనుంది. ఇందుకోసం హైదరాబాద్ రీజియన్ రీజినల్ డైరెక్టర్, టౌన్ ప్లానింగ్ అధికారి నర్సింహారెడ్డి శనివారం పురపాలక సంఘం అధ్యక్షురాలు స్వప్న, కమిషనరు విక్రమసింహారెడ్డి ఇతర అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. వచ్చే 2050కి సంబంధించి మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయటానికి డిజిటల్ సర్వే చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం ఈ నెల 26 నుంచి డ్రోన్ ద్వారా డిజిటల్ సర్వే చేపట్టనున్నట్లు వివరించారు. సర్వే ఆఫ్ ఇండియా, డీటీసీపీ అధికారుల పర్యవేక్షణలో ప్రణాళిక కోసం డిజిటల్ సర్వే నిర్వహించటానికి చర్యలు తీసుకుంటామన్నారు. పురపాలక సంఘం పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని అధ్యక్షురాలు ఆర్డీటీపీ దృష్టికి తీసుకువెళ్లారు.

రూ.2.10 కోట్ల విలువైన బంగారంతో పరారీ

వికారాబాద్, న్యూస్‌టుడే: మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్, వికారాబాద్ శాఖ మేనేజర్ రూ.2 కోట్లకు పైగా విలువైన బంగారు ఆభరణాలతో పరారవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పట్టణ సీఐ భీమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన విశాల్ నాలుగేళ్లుగా మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్, వికారాబాద్ శాఖలో పనిచేస్తున్నారు. ఏడాదిన్నరగా ఆ శాఖ మేనేజర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాకట్టుదారులకు చెందిన 63 సంచులు తీసుకొని ఆయన ఇటీవల పారిపోయారు. వాటిల్లో రూ.2,10,80,296 విలువ చేసే సుమారు 3 కిలోల బంగారు ఆభరణాలున్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని బయటకు పొక్కనివ్వలేదు. ఓ తాకట్టుదారుడు ఈ నెల 18న తన బంగారాన్ని విడిపించుకొనేందుకు వెళ్లగా ఈ బండారం బయటపడింది. ఆందోళనకు గురైన పలువురు శాఖకు వెళ్లి తమ బంగారం గురించి ఆరా తీశారు. సంస్థ గణాంకాధికారి(ఆడిట్) శంకర్‌రెడ్డి పరిశీలించి ఆ 63 మంది జాబితా రూపొందించారు. తాకట్టు బంగారం లాకర్ల తాళాలు సంస్థ మేనేజర్, సహాయ మేనేజర్‌ల వద్ద చెరొకటి ఉంటాయి. కొంత కాలంగా సహాయ మేనేజర్ పోస్టు ఖాళీగా ఉండడంతో కింది స్థాయి ఉద్యోగికి రెండో తాళం చెవి ఇచ్చారు. మేనేజర్ విశాల్ మాటకు ఆయన అడ్డు చెప్పకపోవడం అపహరణకు ప్రధాన కారణంగా సంస్థ ప్రతినిధులు గుర్తించారు. ఆ సంస్థ ప్రాంతీయ మేనేజర్ రవీంద్రకుమార్‌శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హెడ్ కానిస్టేబుల్‌కు అవార్డు



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాజు

దుద్యాల, న్యూస్‌టుడే: పోలీస్ డ్యూటీ మీట్-2024లో హెడ్ కానిస్టేబుల్ రాజు (ఐటీ విభాగం) తొలి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్‌కు ఎంపికయ్యారు. శనివారం తెలంగాణ పోలీసు అకాడమీలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రూ.5లక్షల చెక్కుతో పాటు గోల్డ్‌మెడల్ అందుకున్నాడు. దుద్యాలకు చెందిన మునగాల రాజు లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు.

21న వికారాబాద్‌లో అప్రెంటిస్ మేళా

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వికారాబాద్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో ఈనెల 21న సోమవారం ఉదయం 10 గంటలకు ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా/ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ ఆర్.నరేంద్రబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో లోకేష్, తోషిబా, లక్ష్మి హుందాయి, వెల్సన్, కార్తికేయ, పెన్నార్, జాన్సన్ లిఫ్ట్ తదితర కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తాయని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 9177472488లో సంప్రదించాలన్నారు.

దేవాలయాలపై దాడులను అరికట్టండి



అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రోజు రోజుకు దేవాలయాలపై దాడులు పెరిగిపోతున్నాయని వీటిని అరికట్టేందుకు నిందితులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకులు డి.శ్రీకాంత్, ప్రభాకర్‌గౌడ్, విద్యాసాగర్, శశిధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

అభ్యర్థులకు ఇబ్బందులు రానీయకండి

పోటీ పరీక్షల్లో పాల్గొనే అభ్యర్థులకు ఇబ్బంది కల్గించే విధంగా జారీ చేసిన జీవో 29ను రద్దు చేయాలని నిరుద్యోగ యువకులు, గ్రూప్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సుధీర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కిశోర్, పవన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిండా నీళ్లున్నా.. సాగుకు కరవే..

ఏళ్లుగా మరమ్మతులకు నోచని సర్పన్‌పల్లి



విరిగిపోయిన ప్రాజెక్టు మెట్లు

న్యూస్‌టుడే, వికారాబాద్ గ్రామీణ: వికారాబాద్ మండల పరిధిలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టు వర్షాలు పడిన ప్రతిసారీ నిండుకుండలా తొణికిసలాడుతోంది. కానీ ఏం లాభం. అడుగడుగునా లీకేజీలే.. ఇలా ఒకటి కాదు రెండు కాదు, పదేళ్లకు పైగా ఇలాంటి పరిస్థితే నెలకొంది. పదేళ్ల క్రితం మరమ్మతులకు విన్నవించినా నేటికీ పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడని రైతులు వాపోతున్నారు.

ఇవీ ప్రధాన కారణాలు..

- ఏళ్లుగా కాలువల్లో పూడిక తీయకపోవడం.
- కుడికాలువ కుంగిపోగా తాత్కాలిక మరమ్మతులతో సరి.
- పూర్తిగా దెబ్బతిన్న ప్రాజెక్టు మెట్లు.
- రోజురోజుకు పెరుగుతున్న లీకేజీలు.

ఏటా ప్రతిపాదనలతో సరి

ప్రతిసంవత్సరం ప్రతిపాదనలు సిద్ధం చేయడం తప్ప పరిశీలించి నిధులు మంజూరు చేయడం లేదు. ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ.80లక్షల మంజూరుకు అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు.

సగం భూములు కూడా తడవడంలేదు

ఆయకట్టు మొత్తం 3,285 ఎకరాలు కాగా, ప్రాజెక్టు ఎడమ కాలువ కింద గొట్టిముక్కల, ద్యాచారం, అంతారం గ్రామాలు ఉండగా, కుడి కాలువ కింద మాదారం, నాగసాన్‌పల్లి, సర్పన్‌పల్లి, తరిగోపుల గ్రామాలున్నాయి. ఎడమ కాలువ కింద 11.16 కిలో మీటర్ల విస్తీర్ణం ఉండగా, కుడి కాలువ కింద 12.03 కిలోమీటర్ల విస్తీర్ణం ఉంది. మరమ్మతులు లేని కారణంగా కనీసం సగం ఆయకట్టుకు కూడా నీరు అందడంలేదు. ఇక చివరి ఆయకట్టు భూములు సరేసరి. దీంతో రైతులు రైతులు బోరు, బావులపైనే ఆధారపడాల్సి వస్తోంది. కొత్త ప్రభుత్వంలోనైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు అంచనావేసిన నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపడితే మేలు జరుగుతుందని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ప్రాజెక్టు మెట్లు పూర్తిగా దెబ్బతిన్నందున ఎవరైనా పొరపాటున దిగితే జారి నీటిలో పడే ప్రమాదం పొంచి ఉంది. తాగు, సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి, స్పీకర్ జిల్లా వారే కావడంతో మరమ్మతులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పుడైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని న్యాయం చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో నిండిన కుడికాలువ

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం: నీటిపారుదల శాఖ ఏఈ వరప్రసాద్

సర్పన్‌పల్లి ప్రాజెక్టుకు చేపట్ట వలసిన మరమ్మతుల గురించి వివరించడంతోపాటు రూ.80 లక్షల నిధులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే పనులు వెంటనే చేపడతాం. చివరి ఆయకట్టుకూ నీరు అందేలా చూస్తాం.


మత్స్య కారుల సమస్యల పరిష్కారానికి కృషి



చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ధారూరు: మత్స్య కారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. శనివారం కోట్‌పల్లి జలాశయంలో ఆయన వ్యవసాయ విపణి ఛైర్మన్ అంజయ్యతో కలిసి 2.77 లక్షల చేపపిల్లను వదిలి మాట్లాడారు. మత్స్య కారులు చేపలు పట్టేందుకు అవసరమైన బుట్టలను తన సొంత డబ్బులతో ఇప్పిస్తానని చెప్పారు. జలాశయం సమీపంలో మత్స్యకారుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణం, మరమ్మతుకు వచ్చిన జలాశయం కట్టను బాగు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకయ్య, జిల్లా మత్స్యశాఖ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు అగ్గనూరు శ్రీధర్, కోట్‌పల్లి వ్యవసాయ విపణి వైస్ ఛైర్మన్ నారాయణరెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శోభారాణి పాల్గొన్నారు.

'బలగం' నటి కొమురమ్మకు స్పీకర్ రూ.లక్ష ఆర్థిక సాయం



వికారాబాద్, న్యూస్‌టుడే: 'బలగం' సినిమాలో నటించిన కొమురమ్మకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తన వేతనం నుంచి రూ.లక్ష విరాళం హైదరాబాద్‌లోని అధికార నివాసంలో శనివారం అందించారు. దంపతులైన కొమురమ్మ, మొగిలయ్యలు ఇటీవల ఓ సభలో స్పీకర్‌ను కలిసి ఆర్థిక ఇబ్బందుల గురించి వివరించారు. చలించిన ఆయన రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తానని ఇచ్చిన హామీ మేరకు మాట నిలబెట్టుకున్నారు.

క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు రేపు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక జూబ్లీ క్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం 10 గంటలకు ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక ఉంటుందని అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 1, 2001 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో.. సాంకేతికత

న్యూస్‌టుడే, మెదక్

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఇప్పటికీ అత్యధికులకు వ్యవసాయమే జీవనాధారం. నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో వరి ఎక్కువగా సాగవుతోంది. ఈ మేరకు ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగాలు సన్నద్ధమయ్యాయి. కోతలు షురూ కావడంతో కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రభుత్వం సన్న రకం సాగు చేసిన రైతులకు మద్దతు ధరపై క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిన విషయం విదితమే. **ఇందులో భాగంగా సన్నాలను గుర్తించేందుకు ఈ సీజన్‌లో సాంకేతికతను వినియోగించుకోనుండటం విశేషం.**

నాలుగు జిల్లాల్లో ఇలా..

	ధాన్యం దిగుబడి (లక్షల మె.ట.ల్లో..)	కొనుగోలు కేంద్రాలు
మెదక్	7.49	483
సంగారెడ్డి	3.18	211
సిద్దిపేట	9.0	417
వికారాబాద్	1.0	107

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో 8,99,369 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో సన్నాల సాగే ఎక్కువగా ఉంది. కొందరు దొడ్డు రకం సైతం పండించారు. ఈ క్రమంలో ధాన్యం సేకరణకు అవసరమయ్యే కేంద్రాల ఏర్పాటులో అధికారులు నిమగ్నమయ్యారు. సన్నరకాలు, దొడ్డు ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం 33 రకాలను సన్నాలుగా గుర్తించింది. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ఆయా పరికరాల వినియోగంపై వివిధ జిల్లాల్లో వ్యవసాయ, సహకార, జిల్లా గ్రామీణాభివృద్ధి, మార్కెటింగ్ శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చారు.

సన్నాలు గుర్తించేలా..



సన్న రకానికి ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో వీటి సేకరణలో అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. నాణ్యతతో పాటు సన్న ధాన్యం గుర్తించేందుకు గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రోమీటర్)ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కేంద్రానికి రెండు డిజిటల్ పరికరాల చొప్పున కేటాయిస్తున్నారు. ఈ యంత్రంలో గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. పొడవు 6 మి.మీ. కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ. కంటే ఎక్కువ కాకుండా ఉండాలి. నిర్దేశిత ప్రమాణాలు ఉంటేనే కొంటారు. సంచుల్లో ధాన్యాన్ని నింపాక సులువుగా గుర్తించేలా సన్నాలకు ఎరుపు, దొడ్డు రకానికి ఆకుపచ్చ దారంతో కుట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

వడ్లు ఒలిచేందుకు..



సన్నాలను గుర్తించేందుకు గ్రెయిన్ కాలిపర్ పరికరంలో వడ్లను ఒలిచి బియ్యాన్ని మాత్రమే వేయాల్సి ఉంటుంది. ఇందుకు కొంత శ్రమ అవసరం. సులభంగా వడ్లు ఒలిచేందుకు ప్యాడీ హస్కర్ యంత్రాన్ని అందిస్తున్నారు. ఇందులోకి కొంత ధాన్యాన్ని వేసి తిప్పితే వడ్ల పొట్టు తొలగిపోయి బియ్యంగా మారుతాయి. వాటిలో నుంచి ఓ గింజను గ్రెయిన్ కాలిపర్‌లో వేసే సరిపోతుంది.

ధ్రువీకరించాకే..:



సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. సన్నాలను కొత్త పరికరం ద్వారా గుర్తించి వ్యవసాయ విస్తరణ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. దళారుల ప్రమేయం తగ్గించడానికి ఐరిస్ విధానం దోహదపడుతుంది. ఆయా వాటిపై అధికారులకు శిక్షణ ఇచ్చాం. పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. **హరికృష్ణ, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ, మెదక్**

పక్కదారి పట్టకుండా..



రైతుల నుంచి దళారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొని, వాటిని కొనుగోలు కేంద్రాల్లో భారీగా విక్రయిస్తుంటారు. దీన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం ఐరిస్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇదివరకు కేంద్రానికి వచ్చే వారి వివరాలను నిర్వాహకులు నమోదు చేసి, చరవాణికి ఓటీపీ పంపించేవారు. ధాన్యం విక్రయం సమయంలో మరోసారి ఓటీపీ పంపి ట్రక్‌షీట్‌ను మిల్లులకు పంపేవారు. ఈసారి ముందుగా రైతు వివరాలు నమోదు చేసుకొని ఓటీపీ పంపి, విక్రయ సమయంలో ఐరిస్ వినియోగిస్తారు.

ఆటల్లో గెలుపోటములు సహజం



పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఆటల్లో గెలుపోటములు సహజమని, వాటి ద్వారా మానసిక, శారీరక దృఢత్వం చేకూరుతుందని మెదక్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి (డీవైఎస్‌వో) దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియ ఖేలో ఫుట్‌బాల్ (ఐకేఎఫ్), సౌత్‌క్లాన్ ఫుట్‌బాల్ అకాడమీ (ఎస్‌సీఎఫ్ఏ) సంయుక్తంగా చేపట్టిన ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడలతో పాటు చదువుల్లో రాణిస్తే పలు ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత చదువుల్లో రిజర్వేషన్ సదుపాయం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీల నిర్వాహకులు విష్ణుతేజ మాట్లాడారు. అండర్-13, 15, 17 విభాగాల్లో బాల, బాలికలకు పోటీలు కొనసాగాయి. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల నుంచి మొత్తం 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారుల జాబితాను త్వరలో ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఐకేఎఫ్ స్కౌట్ వినోద్‌కుమార్, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగరాజు, శిక్షకులు ప్రకాశ్, భాగ్యమ్మ, ప్రశాంత్, వినయ్, ధను తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా హాకీ జట్ల ఎంపికలు



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, కంది, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా బాలబాలికల హాకీ అండర్- 14, 17 ఎంపికలు కంది ఐఐటీహెచ్‌లోని డీఏవీ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి అమూల్యమ్మ తెలిపారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొటారని పేర్కొన్నారు.

అన్నదాత ప్రాణాలు తీసిన ఇనుప కంచె



యాదయ్య

వెల్దుర్తి: అడవి పందుల నుంచి రక్షణకు పొలం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్తు సరఫరా అవుతున్న ఇనుప తీగలకు తగిలి రైతు మృతిచెందాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మండలంలోని యశ్వంతరావుపేటకు చెందిన గుండెని యాదయ్య(46) పొలం అటవీ ప్రాంతానికి దగ్గర్లో ఉంది. అడవి పందుల బారి నుంచి రక్షణగా పొలం చుట్టూ ఇనుప కంచె బిగించాడు. శుక్రవారం రాత్రి యాదయ్య భోజనం చేసి పంట కాపలాకు పొలానికి వెళ్లాడు. కంచెకు విద్యుత్తు సరఫరా కల్పించి నిద్రించాడు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన చుట్టుపక్కల రైతులు గమనించగా.. ఇనుప కంచె తగిలి యాదయ్య మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. శనివారం యాదయ్య భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చేపలు పట్టడానికి వెళ్లి మృత్యువాత



శ్రీనివాస్

నార్సింగి(చేగుంట): చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు వల చుట్టుకొని నీట మునిగి వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై అహ్మద్ మొహినొద్దీన్ తెలిపిన వివరాలు.. నార్సింగి మండలం నర్సంపల్లికి చెందిన ఉడుత శ్రీనివాస్ (50) వ్యవసాయం చేస్తుంటాడు. స్థానిక చెరువులో చేపలు పట్టేందుకు వలలు వేశాడు. శనివారం ఉదయం వెళ్లగా వెళ్లి ప్రమాదవశాత్తు వల చిక్కుకొని నీట మునిగి మృతిచెందాడు. అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. శ్రీనివాస్‌కు భార్య, కుమార్తె, కుమారుడున్నారు. కేసు నమోదైంది.


ట్రాక్టర్ బోల్తా పడి మహిళ దుర్మరణం



సాయమ్మ

కౌడిపల్లి: ట్రాక్టర్ బోల్తాపడి మహిళ దుర్మరణం పాలైంది. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధి భుజరంపేట పరిధి వెంకటాపూర్‌కు చెందిన బడిగంటి సాయమ్మ(54). శనివారం ఇంటి నిర్మాణానికి కౌడిపల్లి నుంచి ట్రాక్టర్లో డస్ట్ తీసుకెళుతుండగా.. శివారులోని కూకుట్లపల్లి రోడ్డుపై మల్లు కుంట శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ ట్రాలీపై కూర్చున్న సాయమ్మ డస్ట్‌లో కూరుకుపోయి చనిపోయింది. డ్రైవర్ యాదాగౌడ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

వాహనం ఢీకొని వృద్ధుడు..



నారాయణ

మిరుదొడ్డి: వాహనం అదుపుతప్పి వృద్ధుడిని ఢీకొట్టడంతో మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా భూంపల్లి ఎస్సై హరీశ్ తెలిపిన వివరాలు.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లికి చెందిన పర్స నారాయణ(66) రహదారి పై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో డీసీఎం వాహనం అతివేగంగా వచ్చి అదుపుతప్పి వెనుక నుంచి నారాయణను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు స్వామి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పరిశ్రమ సంపులో పడి ఎలక్ట్రికల్ ఇంజినీర్ మృతి

జిన్నారం, న్యూస్‌టుడే: పరిశ్రమ సంపులో పడి ఎలక్ట్రికల్ ఇంజినీర్ మృతి చెందిన సంఘటన జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో చోటు చేసుకుంది. ఐడీఏ బొల్లారం పోలీసులు, పరిశ్రమ వర్గాల తెలిపిన వివరాలు.. సెల్‌మార్ ల్యాబరేటరీ పరిశ్రమలో పదిలం రాజేశ్ (31) ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం 6 గంటలకు మొదటి షిఫ్టులో విధులకు వచ్చిన ఆయన చిల్లింగ్ ప్లాంటు బ్రెయిన్ సంపులో పడి మృతి చెందాడు. ఆ సమయంలో ఎవరూ చూసి ఉండకపోవచ్చని చెబుతున్నారు. భద్రాచలం ప్రాంతంలోని కొత్తగూడెంకు చెందిన రాజేశ్ గత కొంతకాలంగా మేడ్చల్ జిల్లా సూరారంలో ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, చిన్న పాప ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఐడీఏ బొల్లారం సీఐ గంగాధర్ పరిశీలించారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై అనుమానాలు ఉన్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు.

నీతులు చెప్పాల్సిన నోటితో బూతులు

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: పిల్లలకు నీతులు చెప్పాల్సిన ఓ ప్రధానోపాధ్యాయుడు ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా ఒకరు ఇటీవల బదిలీపై వచ్చారు. ఇక్కడ చేరినప్పటి నుంచి విద్యార్థులను మాటలతో హింసించడంతో పాటు మూత్రశాలకు వెళ్లినా తిడుతున్నాడంటూ పలువురు తమ తల్లిదండ్రులకు చెప్పారు. శనివారం గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ప్రధానోపాధ్యాయుడిని నిలదీశారు. బడికి రావాలంటే పిల్లలు భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీఈవో రాధాకిషన్, ఎంఈవో పుష్పవేణిలకు ఫోన్‌లో విషయాన్ని వివరించారు. ఎంఈవో పాఠశాలకు వచ్చి వారితో మాట్లాడి ఆరా తీశారు. వాస్తవమని తేలడంతో మరోసారి ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్ఎంను హెచ్చరించారు. ఇకనుంచి ఇబ్బందులు ఎదురైతే నా దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

ఒత్తిడి లేకుండా విధులు నిర్వహిస్తేనే ఆరోగ్యం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఉద్యోగులు విధుల నిర్వహణలో ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా చూసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు మామిడాల శ్రీనివాస్ సూచించారు. అప్పుడే అనారోగ్యాలకు గురికాకుండా ఉంటారని తెలిపారు. ఒత్తిడి అధిగమించడంపై సిద్దిపేట కమిషనరేట్‌లో అధికారులు, సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కమిషనరేట్ ఏవో యాదమ్మ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్‌గౌడ్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య



లింగయ్య

గజ్వేల్ గ్రామీణ: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన జగదేవపూర్ మండలం కొల్గురులో చోటు చేసుకుంది. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాలు.. కొల్గుర్‌కు చెందిన బండారి లింగయ్య(55) గ్రామంలో పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితం అతని భార్య మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపం చెంది.. జీవితంపై విరక్తితో శుక్రవారం అర్ధరాత్రి ఇంటి పక్కన ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

చికిత్స పొందుతూ మరొకరు..

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాలు.. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి ఆర్అండ్ఆర్ కాలనీ వేములఘాట్‌కు చెందిన కంటి ప్రభాకర్(22) ఆటో నడుపుతు జీవనం సాగించేవాడు. జల్సాలకు అలవాటుపడి ఆరు నెలల క్రితం ఆటో అమ్మేశాడు. మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో.. చనిపోతున్నట్లు ఫోన్‌లో వాట్సాప్ స్టేటస్ పెట్టి ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. వాట్సాప్ స్టేటస్ చూసిన కొందరు హుటాహుటిన ఇంటికి చేరుకొని గడియ పగలగొట్టి లోపలికి వెళ్లి కిందికి దించారు. గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం ఆర్వీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఉద్యాన పంటలను మరింత ప్రోత్సహించాలి



మంత్రి తుమ్మలను కలిసిన ఉద్యాన వర్సిటీ వీసీ రాజిరెడ్డి

ములుగు, న్యూస్‌టుడే: మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల సాగు వైపు రైతులు ఆసక్తి చూపేలా కార్యక్రమాలు అమలు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీగా నూతనంగా నియమితులైన దండా రాజిరెడ్డి శనివారం రాత్రి హైదరాబాదులో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వీసీతో పలు అంశాలపై చర్చించారు.

ప్రమాదానికి గురైన కారు.. పట్టుబడిన గంజాయి

80 కిలోలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



ఎండు గంజాయి బస్తాలు పరిశీలిస్తున్న పోలీసులు

రామాయంపేట, న్యూస్‌టుడే: ప్రమాదానికి గురైన కారులో భారీగా గంజాయిని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న కారు జాతీయ రహదారిపై రామాయంపేట శివారులోకి రాగానే అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న వారు కారును అక్కడే వదిలి పారిపోయారు. పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు కారును గుర్తించి తనిఖీ చేయగా.. గంజాయి బస్తాలు బయటపడ్డాయి. ఎస్సై బాలరాజు ఘటనా స్థలానికి వచ్చి కారు డిక్కీలో ఉంచిన నాలుగు బస్తాల్లోని 80 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 120-00	డ్రెస్డ్ 206-00
రిటైల్ 142-00	స్కిన్‌లెస్ 234-00

చికిత్స పొందుతూ బావ బామ్మర్దులు మృతి

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న లారీని బొలేరో వాహనం ఢీకొన్న ఘటనలో శుక్రవారం రాత్రి ఇద్దరు తీవ్రంగా గాయపడగా.. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం కూటిగల్ తండాకు చెందిన లావుడ్యా వాగ్యా(30), అతని బావ భూక్య రాజు(46) ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్‌లుగా బీఎస్ఎన్ఎల్‌లో పని చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఆదిలాబాద్‌లో పనులు ముగించుకుని వాహనంలో ఇద్దరూ ఇంటికి బయల్దేరారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్ శివారులోని చేపలకాలనీ వద్ద పార్కింగ్ ఇండికేటర్స్ వేయకుండా, నిర్లక్ష్యంగా రోడ్డు మీద ఆపిన లారీని గమనించక వెనక నుంచి ఢీకొన్నారు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో వాహనదారులు, పోలీసులు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.

లక్ష్మీపతిగూడెంలో పట్టపగలే చోరీ

జిన్నారం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని దుండగులు శనివారం పట్టపగలు లక్ష్మీపతిగూడెంకు చెందిన జనార్దన్ ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని నాలుగు తులాల బంగారం, ఆరు తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.40 వేల నగదు చోరీ చేసినట్లు బాధితుడు వాపోయారు. జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని క్లూస్ టీం ఆధారంగా విచారణ చేస్తున్నట్లు ఎస్సై నాగలక్ష్మి పేర్కొన్నారు.

'సైక్లింగ్'లో సిద్దిపేట జిల్లా క్రీడాకారుల సత్తా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి ట్రాక్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా ఖేలో ఇండియా సైక్లింగ్ అకాడమీ క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-18 బాలికల విభాగంలో టైమ్ ట్రయల్ 500 మీటర్ల అంశంలో కె.హర్షిత (హుస్నాబాద్-ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల) తృతీయ స్థానం, అండర్-16 బాలికల విభాగంలో రిజ్వానా బేగమ్ (సిద్దిపేట-ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల) నాలుగో స్థానంలో నిలిచారని జిల్లా సైక్లింగ్ అకాడమీ శిక్షకుడు సంజీవ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా యువజన క్రీడల ఇన్‌ఛార్జి అధికారి జయదేవ ఆర్య, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటనర్సయ్య తదితరులు క్రీడాకారులను అభినందించారు.

గురుకులంలో కాగ్నిజెంట్ శిక్షణ శిబిరం



అవగాహన కల్పిస్తున్న కాగ్నిజెంట్ డిప్యూటీ జీఎం శ్రీనివాస్ కుప్ప

వర్గల్, న్యూస్‌టుడే: ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు కాగ్నిజెంట్ డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్ కుప్ప పేర్కొన్నారు. శనివారం వర్గల్ మహాత్మ జ్యోతి బాపులే బీసీ డిగ్రీ మహిళా గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈనెల 23న తృతీయ సంవత్సరం చదువుతున్న 15 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులు గచ్చిబౌలి కాగ్నిజెంట్ సంస్థను సందర్శించి అక్కడి నిర్వాహకులతో నైపుణ్య శిక్షణ పొందనున్నట్లు చెప్పారు. ప్రిన్సిపల్ భాస్కరరావు, వైస్ ప్రిన్సిపల్ గోవిందరావు, సంస్థ ప్రతినిధులు, విద్యాలయం ప్లేస్‌మెంట్ నిర్వాహకులు రాధ, నిఖిత పాల్గొన్నారు.

చాకరిమెట్లలో భక్తుల సందడి



సత్యనారాయణ స్వామి వ్రతపూజలో భక్తులు

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం చాకరిమెట్లలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజామున స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అభిషేకం, అర్చన చేపట్టారు. సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో సామూహిక వ్రతాలు కొనసాగాయి. ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ ఆంజనేయశర్మ, ఈవో సార శ్రీనివాస్, ప్రధాన పూజారి దేవదత్త శర్మ తదితరులున్నారు.

ఉపాధితోనే వలసల నివారణ

న్యూస్‌టుడే, నారాయణఖేడ్



తల్లిదండ్రుల వెంట చిన్నారులు

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలోనే వెనుకబడిన ప్రాంతం. ఇక్కడ 188 వరకు తండాలు ఉండగా, 50 వేలకు పైగా గిరిజనులు నివసిస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా పరిశ్రమలు లేకపోవడం గమనార్హం. దీంతో యువత, ఇతర వర్గాల వారికి సరైన ఉపాధి దొరక్క వేరే ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. ఇక చెరకు నరికే సీజన్ వచ్చిందంటే చాలు.. ఈ ప్రాంతంలోని తండాలన్నీ ఖాళీ అవుతాయి. వృద్ధులు, చిన్నారులు మాత్రమే కనిపిస్తారు. చెరకు నరికేందుకు కుటుంబమంతా వలస వెళ్లడమే ఇందుకు కారణం.

పంటలు నష్టపోవడంతో..

ప్రతి ఏటా నవంబరులో చక్కెర కర్మాగారాలు తెరచుకుంటాయి. చెరకు చేతికొచ్చే సమయం కావడంతో ఈ పనికి నారాయణఖేడ్ ప్రాంతీయులంతా వెళ్తుంటారు. ఇందుకు చక్కెర కర్మాగారాలు, చెరకు తోటల యజమానుల నుంచి అడ్వాన్స్‌గా డబ్బు ముందుగానే తీసుకుంటుంటారు. గిరిజనుల్లో అత్యధికంగా వలసలతో పాటు వ్యవసాయం, కూలీ పనులపైనే ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నారు. ఇటీవలి భారీ వర్షాలతో 40 శాతానికి పైగా పంటలు నష్టపోయాయి. స్థానికంగా పనులు దొరికే అవకాశం అంతంతే. ఈ తరుణంలో బతుకుబండిని నడిపించేందుకు వలస బాట పట్టని పరిస్థితి నెలకొంది. దీంతో వలస వెళ్లే వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

విద్యార్థులు సైతం..

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10 వేల మందికి పైగా గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. గతేడాది సుమారు 3 వేల మందికి పైగా తల్లిదండ్రుల వెంట వలస వెళ్లారు. ప్రైవేటు పాఠశాలల్లో 1,500 మందికి 250 మంది వరకు, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 300 మందికి 180 మంది వరకు వలస వెళ్లారు. చెరకు కోత సీజన్ ప్రారంభం నుంచి ముగిసే వరకు నాలుగు నెలల పాటు చదువుకు దూరమయ్యారు. ఈ సారి ఇదే పరిస్థితి ఎదురుకానుంది.

దృష్టిసారిస్తే..

తండాల్లోనే ఉపాధి హామీతో పాటు ఇతర ఉపాధి అవకాశాలు కల్పిస్తే వలసల నివారణ సాధ్యమవుతుంది. ఇందుకు ఇప్పటి నుంచే జిల్లా యంత్రాంగం ఉపక్రమించాల్సిన అవసరం ఉంది. ఏయే తండాల నుంచి ఎంతమంది వలస వెళ్లే అవకాశం ఉంది, నివారణకు ఏయే పనులు చేపట్టాలి, వెళ్లక తప్పని పరిస్థితులున్న కుటుంబాలు ఎన్ని తదితర విషయాలను సేకరించి కార్యాచరణ రూపొందించాలి. ఇక పిల్లలను వెంట తీసుకెళ్లకుండా చూపాల్సిన చొరవపై దృష్టిసారిస్తే కొంతవరకైనా మార్పు సాధ్యం.

యోగాలో బాలికలు అదుర్స్

న్యూస్‌టుడే, చేర్యాల



యోగాసనాల ప్రదర్శనలో చిన్నారులు

యోగా.. శారీరక, మానసికపర సమన్వయానికి ఏకైక సాధనం. ప్రసుతం పట్టణాల నుంచి పల్లెల వరకు, పిల్లల నుంచి వృద్ధుల వరకు నిత్యం సాధన చేస్తుండటం విశేషం. ప్రపంచవ్యాప్తంగా దీన్ని ప్రాధాన్యాన్ని గుర్తించగా, ఐక్యరాజ్య సమితి జూన్ 21న ప్రత్యేకంగా 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'ను నిర్వహిస్తున్న విషయం విదితమే. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో దీన్ని చేర్చడంతో పిల్లలు నేర్చుకునేందుకు ఆస్కారం ఏర్పడింది. ఈ క్రమంలో చేర్యాల మండలం ఆకునూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎం.సాత్విక, పి.అవంతిక జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం విశేషం. వచ్చే నెల రెండో వారంలో అసోం రాష్ట్రం గౌహతిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.కవిత నిత్యం సాధన చేయించడంతో ఈ స్థాయికి చేరడం విశేషం.

ప్రయోజనాలు తెలియజేసి..:

ఎం.కవిత, వ్యాయామ ఉపాధ్యాయురాలు




పాఠశాలలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీలతో పాటు యోగా సాధన చేయిస్తున్నాం. దీనివల్ల కలిగే ప్రయోజనాలను వివరించి పిల్లలను ప్రోత్సహిస్తున్నాం. ఎస్‌జీఎఫ్ యోగా పోటీల్లో పాఠశాల నుంచి ఇద్దరు అమ్మాయిలు జాతీయ స్థాయి ఎంపికవడం సంతోషంగా ఉంది. జాతీయస్థాయిలోనూ పతకాలు సాధిస్తారన్న నమ్మకం ఉంది. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు సహకారం అందిస్తున్నారు.

నిత్యం సాధనతో..



పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు నిత్యం సాధన చేయించారు. ఏ ఆసనం ఎలా వేయాలో నేర్పించారు. ప్రతి రోజూ ఇంట్లోనూ సాధన చేశాం. పోటీల్లో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రోత్సహించారు. జాతీయస్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నాం. **ఎం.సాత్విక, 8వ తరగతి**

ఇంటి వద్ద నేర్పిస్తూ..:



రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం సంతోషంగా ఉంది. మేము నేర్చుకున్న ఆసనాలను ఇంటి వద్ద మా తల్లిదండ్రులకు, పక్కింటి వారికి సైతం నేర్పిస్తున్నాం. యోగాతో కలిగే ప్రయోజనాలు తెలియడంతో ఆసక్తి పెరిగింది. **పి.అవంతిక, 7వ తరగతి**

రుణాలు సద్వినియోగం చేసుకుంటే మేలు

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: బొంరాస్‌పేట మండల మహిళా సమాఖ్య 24వ వార్షిక మహాసభ సమావేశం శనివారం మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో గత ఏడాదికి సంబంధించిన జమా, ఖర్చుల వార్షిక నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఏపీఎం సత్తయ్య, సీసీ యాదయ్య మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకులు ఇతర సంస్థల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లించి ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి అంభుజ, కోశాధికారి భాగ్యమ్మ, సిబ్బంది సునీత, సంజప్ప, సురేష్‌బాబు, అజీజ్, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు



పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ధారూర్, న్యూస్‌టుడే: వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారులు సంజురాథోడ్, శిరీష అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగారం గ్రామంలో వరి పంటను, వర్షాలకు దెబ్బతిన్న పంటను పరిశీలించారు. పంటలకు ఆశించిన తెగుళ్లను గుర్తించి వాటి నివారణ, పిచికారీ చేయాల్సిన మందుల గురించి రైతులకు సూచించారు.

పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు



అగ్గనూర్ ప్రాథమిక పాఠశాలలో..

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: నాలుగో శనివారం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) నిర్వహించారు. సమావేశంలో విద్యార్థుల సామర్థ్యాలను తల్లిదండ్రుల సమక్షంలో ప్రదర్శించారు. పాఠశాలల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. బొంరాస్‌పేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

యాలాల: పాఠశాల నుంచి విద్యార్థులు ఇంటికి వెళ్లిన తర్వాత వారిపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అగ్గనూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొగులప్ప అన్నారు. శనివారం యాలాల మండల పరిధిలోని అగ్గనూర్ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

పల్లెల్లో భయాందోళన

న్యూస్‌టుడే, పూడూరు



దామగుండం అడవిలో సీసీ కెమెరాల ఏర్పాటు

అడవుల చుట్టూ కంచెలు లేకపోవడంతో అరణ్యంలో ఉండాల్సిన జంతువులు పల్లెలకు పరుగులు పెడుతున్నాయి. పంట పొలాల్లో తిరుగుతుండడంతో జనాలు భయాందోళన చెందుతున్నారు. తాండూరు, యాలాల, పరిగి వివిధ ప్రాంతాల్లో చిరుత సంచారం ఆందోళనకు కారణం అవుతోంది.

దామగుండంలో..

దామగుండం అటవీ ప్రాంతంలో గత ఏడాది అక్టోబరులో లేగదూడను అడవి జంతువు చంపడంతో కలకలం సృష్టించింది. అడుగులను పరిశీలించిన అటవీశాఖ అధికారులు వివిధ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరిశీలించగా దాని ఆనవాళ్లు లభ్యమయ్యాయి. అప్పటి వరకు పశువుల కాపరులు, జనాలు అటువైపు వెళ్లకుండా సిబ్బందిని కాపలా పెట్టించారు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ అటవీ ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చినట్లు అనుమానించారు. అప్పట్లో చుట్టుపక్క గ్రామాల జనాలకు అవగాహన కల్పించారు.

గొంగుపల్లి, గోధుంగూడ శివార్లలో..

గత ఏడాది నవంబరులో పూడూరు మండలం గొంగుపల్లి శివారు ఎన్కెపల్లి గేటు సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో చిరుత కలకలం సృష్టించింది. అక్కడ పని చేసే ఆంజనేయులు బోరును ఆన్ చేసేందుకు పొలంలోకి వెళ్లాడు. గుబురుగా ఉన్న గడ్డిలో పడుకుని ఉన్న చిరుత మనిషి కదలికలను పసిగట్టి అడవి వైపు పరుగులు పెట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గోధుంగూడ సమీపంలో మేకల మందపై దాడిచేసి రెండింటిని కొరికేసింది.

అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలోని వివిధ అటవీ ప్రాంతాలతో పాటు గ్రామాల్లో చిరుత సంచరిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గుబురు పొదలు, పంట పొలాల్లోకి వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. పశువుల కాపరులు ఒంటరిగా అడవి ప్రాంతాలకు వెళ్లరాదు. చిన్నపిల్లలు పొలాల వైపు తిరగరాదు. **అరుణ, ఫారెస్టు అధికారిణి, వికారాబాద్**

తాజాగా యాలాలలో..

ఇటీవల తాండూరు నియోజకవర్గం యాలాల మండలంలో ఓ ఎద్దుపై దాడి చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అటవీశాఖ అధికారులు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటంతో చిరుత ఆనవాళ్లు లభించాయి, అక్కడి నుంచి కర్ణాటక వైపు వెళ్లినట్లు అనుమానిస్తున్నారు. శనివారం పరిగి, కొడంగల్ ప్రాంతాలోనూ చిరుత ఆనవాళ్లు ఉన్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అటవీశాఖ అధికారులు రంగంలోకి దిగారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, పూడూరు: ? కూడలి నుంచి హనుమాన్ మందిరం వైపువెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన నియంత్రిక వద్ద పొదలు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – **అశోక్, మన్నెగూడ**

✓ వెంటనే పరిశీలించి రాకపోకలకు ఇబ్బందులు రాకుండా చూస్తాం. – **మాణిక్యం, పంచాయతీ కార్యదర్శి**

న్యూస్‌టుడే, దౌల్తాబాద్: ? దేశాయిపల్లి యాంకీ గ్రామాల మధ్య తారు రోడ్డు కోసుకుపోయి ప్రమాదకరంగా మారింది. అధికారులు చర్యలు తీసుకోవాలి. – **ప్రభు, దేశాయిపల్లి**

✓ ఈప్రాంతంతో పాటు మరిన్ని రోడ్డు వర్షాలకు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. – **రవికిరన్, పీఆర్‌ఏఈ, దౌల్తాబాద్**

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ: ? చింతల్‌కుంటతండాలో రోడ్డుకు పక్కనే నియంత్రిక ప్రమాదకరంగా కనిపిస్తుంది. దాని చుట్టూ రక్షణగా కంచెను ఏర్పాటు చేయించాల్సిన అవసరం ఉంది. చాలా రోజులుగా ఎవరూ పట్టించుకోవడం లేదు. – **రవినాయక్, స్థానికుడు**

✓ ప్రమాదకరంగా ఉన్న నియంత్రికల సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించేలా చూస్తున్నాం. చింతల్‌కుంటతండాలోని సమస్య మా దృష్టికి వచ్చింది. దాని చుట్టూ రక్షణగా కంచెను ఏర్పాటు చేయించేలా చూస్తాం. – **సాయికిరణ్, ఏఈ విద్యుత్తు శాఖ**

న్యూస్‌టుడే, పరిగి: ? బీజాపూర్ -హైదరాబాద్ జాతీయ రహదారిపై విభాగినుల వద్ద మట్టి పేరుకుపోతోంది. భారీ వాహనాలు వెళ్తున్న సమయంలో దుమ్ము కళ్లలో పడి ప్రమాదాలకు ఆస్కారంగా మారింది. తొలగించి ఇబ్బందులను నివారించాలి – **రమేష్, వెంకటేశ్వర్లు, పరిగి**

✓ వారానికోసారి పూర్తిస్థాయిలో పనులు జరిగేలా హైవే అథారిటీ అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నాం. అత్యవసర పరిస్థితులను బట్టి పారిశుద్ధ్య సిబ్బంది సేవలను వినియోగించుకుని సమస్యను పరిష్కరిస్తాం. – **వెంకటయ్య, కమిషనర్, మున్సిపాలిటీ.**

విద్యార్థులకు మిఠాయిల పంపిణీ

పెద్దేముల్, న్యూస్‌టుడే: మంబాపూర్, రుక్మాపూర్, రేగొండి, కొండాపూర్, మన్‌సాన్‌పల్లి గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు తాండూర్ మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో మిఠాయిలను పంచిపెట్టారు. దీపావళి పండుగ ఆవశ్యకతను చిన్నారులకు ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు మన్మోహన్‌సార్డ, తాండూరు అధ్యక్షుడు అనీల్ సార్డ, కార్యదర్శి సచిన్‌రాఠి, పవన్ సోనీ, దినేష్, నిహార్, సునీల్, కరణ్, రోహిత్, నిఖిల్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎంపిక



అర్జున్

పూడూరు, న్యూస్‌టుడే: పూడూరు ఆదర్శ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అర్జున్ అండర్ 19 విభాగంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తరపున సరూర్‌నగర్‌లో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. వచ్చేనెల నారాయణపేట జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకట్ వెల్లడించారు. ప్రిన్సిపల్ సరళ ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

భాజపాయే.. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం



మాట్లాడుతున్న కల్యాణ్ నాయక్

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా భాజపా ఎదుగుతుందని, భవిష్యత్‌లో పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్ నాయక్ అన్నారు. శనివారం బొంరాస్‌పేటలో విలేకరులతో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు తమ పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. పార్టీ కొడంగల్ ఇన్‌ఛార్జి బంటు రమేశ్, ఓబీసీ మోర్చా నాయకులు బాబయ్య నాయుడు, జగదీష్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు, రవీందర్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

ఈనాడు కథనానికి స్పందన

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: 'చువ్వలు తేలినా పట్టించుకోరా'.. శీర్షికతో శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం కల్వర్టుపై ధ్వంసమైన, చువ్వలు తేలిన గుంతను తారుతో పూడ్పించి తాత్కాలికంగా మరమ్మతు చేయించారు.

బాధితులకు అండగా ఉంటాం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: రెండు రోజుల క్రితం నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విలేకరి రాములుగౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని కాంగ్రెస్ నాయకులు, ఆర్బీఎల్ ఫ్యాక్టరీ ఛైర్మన్ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కుల్కచర్ల మండలం తిర్మలాపూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పరీక్ష రాశారు.. ప్రతిభ చాటారు



వికారాబాద్ పాఠశాల ప్రిన్సిపల్‌తో బహుమతులు అందుకున్న విద్యార్థులు



తాండూరులో విద్యార్థులతో హెచ్‌ఎం శివకుమార్, ఉపాధ్యాయులు

వికారాబాద్ మున్సిపాలిటీ, తాండూరు, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని భాష్యం ఉన్నత పాఠశాలలో, తాండూరులోని నంబరు-1 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'అంతర్జాలం వినియోగం లాభ నష్టాలు- సోషల్ మీడియా ప్రభావం' అంశంపై శనివారం ఆంగ్లంలో ఈ పోటీలు నిర్వహించారు. వికారాబాద్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బి.హర్షిత, కె.మౌనిక, ఎం.నైనిత్యా నిలిచారు. కళాశాల ప్రిన్సిపల్ ఎండీ. అజారొద్దీన్, డైరెక్టర్ డాక్టర్ సనామస్రత్ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. తాండూరులో విద్యార్థులు ఎం.భాను ప్రసాద్, కె.పూజ, నాజ్‌మీన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.శివకుమార్ బహుమతులను, ప్రశంసాపత్రాల్ని అందజేశారు.

బోరు మోటార్లు సత్వరం బాగు చేయించండి



మాట్లాడుతున్న ఏఈ అఖిల్

పెద్దేముల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో బోరు మోటార్ల మరమ్మతులు 24 గంటల్లో చేపట్టాలని మిషన్ భగీరథ ఏఈ అఖిల్ తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ మెకానిక్ లకు బోరు మోటార్ల మరమ్మతులపై శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. తాగునీటి ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జర్నప్ప, ఎంపీవో రతన్ సింగ్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపైనే మురుగు

కుల్కచర్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో అవసరమైన చోట్ల మురుగు కాలువల నిర్మాణం లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం ప్రధాన చౌరస్తా నుంచి చిన్నగేటు వరకు రహదారిని విస్తరించారు. కాగా ఒక వైపు మాత్రమే కాలువ నిర్మాణం జరిగింది. మరో వైపు కాలువ నిర్మాణాన్ని చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. నివాస గృహాల్లోంచి వచ్చే నీరు రహదారిపైకి వస్తోంది. ప్రధాన చౌరస్తా నుంచి చిన్నగేటు ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రాత్రి వేళ దోమల సమస్య పెరిగిందని స్థానికులు వాపోతున్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చండి

దుద్యాల, కొడంగల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక మంజునాథ్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కూర వెంకటయ్య, తిరుపతి, శేఖర్, హన్మంతు, వెంకటప్ప మదరప్ప పాల్గొన్నారు.

నస్కల్‌ను పరిగి పురపాలికలో కలపొద్దు

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: పరిగి పురపాలికను 5 కిలోమీటర్లు విస్తరించే క్రమంలో మేజర్ గ్రామ పంచాయతీగా కొనసాగుతున్న నస్కల్ గ్రామాన్ని కలపొద్దని కాంగ్రెస్ మండల పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రత్నం ఓప్రకటనలో డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాండూరు రైల్వే పోలీసులు శనివారం తెలిపిన ప్రకారం 35 నుంచి 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి తాండూరు రైల్వే స్టేషన్ పరిధిలో పర్భని ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించ లేదన్నారు. పరీక్షల కోసం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

దోమలో తాగునీటికి కటకట

దోమ, న్యూస్‌టుడే: దోమ ఎస్సీ కాలనీలో 30 ఇళ్లకు తాగునీరు సరఫరా కావటం లేదని స్థానికులు వాపోతున్నారు. పల్లం ప్రాంతంలో ఇబ్బంది లేకున్నా.. కాస్త ఎత్తులో నివాసాలు ఉంటున్న వారికి ఇబ్బందులు వస్తున్నట్లు వాపోతున్నారు. బిందెలు పట్టుకుని నీళ్లకోసం వెళ్లి బరువులతో ఎత్తైన ప్రాంతానికి ఎక్కలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధులేవీ..

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: తండాల రోడ్ల మరమ్మతులకు నిధులు ఇవ్వాలని గిరిజన సంఘం మండల నాయకులు తులసీరాంనాయక్ ప్రకటనలో తెలిపారు. వర్షాలు కురిసిన కారణంగా పటేల్‌చెరువు తండా, హన్మ్యానాయక్ తండా, చాకల్‌పల్లితండా, ఎర్రగోవిండ్ తండాలకు వెళ్లే రోడ్లన్నీ గుంతలమయంగా మారాయన్నారు.

కోస్గిలో 21న జల్సా

దుద్యాల, కొడంగల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 21న నారాయణపేట జిల్లా కోస్గి మదీనా మసీదులో జరిగే జల్సా ఉత్సవాలను విజయవంతం చేయాలని మాజీ ఉపసర్పంచి ఎస్.ఎం.గౌసన్ అన్నారు. శనివారం కొడంగల్‌లోని మక్కా మసీదులో మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లాఖాన్, షేక్ ఆదిల్, ఖాలెద్, యూసుఫ్, సలీం పాల్గొన్నారు.

ఆత్మీయ సభకు తరలిన గోపాలమిత్రలు

బొంరాస్‌పేట: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఆత్మీయ సన్మాన సభకు కొడంగల్ నియోజకవర్గంలోని 12 మంది గోపాలమిత్రలు తరలి వెళ్లారు. తమ సమస్యలను మంత్రికి విన్నవిస్తామని మహేష్‌కుమార్, వెంకటేష్‌గౌడ్, విశ్వనాథం, బాలరాజుగౌడ్, వెంకటప్ప, శివకుమార్, స్వయంప్రకాష్ తెలిపారు.

పరిగిలో భారాస నిరసన నేడు

పూడూరు: రైతు సమస్యల పరిష్కారం కోసం ఆదివారం భారాస ఆధ్వర్యంలో నిరసన చేపట్టినట్లు పూడూరు మాజీ ఉపసర్పంచి రాజేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. పరిగి పట్టణంలోని ప్రధాన కూడలిలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు.

మండలి చీఫ్‌విప్‌ను కలిసిన గ్రంథాలయ సంస్థ ఛైర్మన్

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేష్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాకమిషన్ సలహాదారు నియామకంపై హర్షం

తాండూరుగ్రామీణ: రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సలహాదారుగా ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డిని నియమించడంపై బాలల హక్కుల కమిటీ జిల్లా ప్రతినిధి ధనసిరి ప్రకాశ్ హర్షం వ్యక్తం చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు, బాలల విద్యా హక్కు పరిరక్షణకు రెండు దశాబ్దాలకుపైగా కృషి చేయడంతో పూర్తి అవగాహన ఉందన్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: శిక్షణ పొందిన ఉపాధ్యాయులు బోధించే సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈవో గోపాల్ అన్నారు. శనివారం పరిగి మండలం మిట్టకోడూరు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ఉస్మాన్‌అలీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరై ప్రసంగించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితుల గురించి, ఇంటికి చేరుకుని ఉపాధ్యాయులిచ్చిన ఇంటిపని చేస్తున్నారాలేదా? అని దృష్టిపెట్టాలని సూచించారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



తిమ్మారెడ్డిపల్లిలో అవగాహనలో..

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: మనచుట్టూ ఉండే పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచితే రోగాల బారిన పడకుండా ఉంటారని వైద్యాధికారి తుల్జారామ్ అన్నారు. శనివారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల చుట్టూ దోమలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలతో విషజ్వరాలు సోకుతాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మంగమ్మ, శ్రీదర్‌రెడ్డి, శ్రీనివాస్, బాలరాజు ఆశాకార్యకర్తలున్నారు.

తైక్వాండోతో ఆత్మరక్షణ

వికారాబాద్ మున్సిపాలిటీ: ఆత్మరక్షణకు తైక్వాండో శిక్షణ ఎంతో దోహదపడుతుందని తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ రాఘవన్ నాయక్ అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన 14నుంచి 17 సంవత్సరాల లోపు బాలబాలికల విభాగంలో పోటీలు నిర్వహించి మాట్లాడారు.

రేషన్ బియ్యం పట్టివేత

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసిన సంఘటన ముజాహిద్‌పూర్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. కుల్కచర్ల ఎస్సై అన్వేష్ రెడ్డి తెలిపిన వివరాలు.. శ్రీకాంత్ ఆటోలో 300 కిలోల రేషన్ బియ్యాన్ని ముజాహిద్‌పూర్ నుంచి కుల్కచర్ల వైపు తీసుకువెళ్తున్నాడు. గస్తీలో ఉన్న పోలీసు సిబ్బంది ఆటోను ఆపి తనిఖీ చేయగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లుగా గుర్తించారు. ఆటోను ఠాణాకు తరలించి బియ్యాన్ని తరలిస్తున్న అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

ప్రమాదకరంగా నియంత్రికలు





దుద్యాల, న్యూస్‌టుడే: మండల కేంద్రం నుంచి అల్లీఖాన్‌పల్లికి వెళ్లే రోడ్డు మార్గానికి ఆనుకొని ఇరువైపులా.. ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రికలు ఉన్నాయి. ప్రస్తుతం తారు రోడ్డు పనులు కొనసాగుతుండటంతో వాహనాలు ఈ రోడ్డు వెంబడి వెళ్తున్నాయి. వాస్తవంగా రోడ్డు పనుల సమయంలో వాటిని తొలగించాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు కనీసం నియంత్రికల చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.